
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 11 | జనవరి | 2023





## లోవ మంటపానికి విరాళం

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఐదంతస్తుల మహా మంటపం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రూ.51 వేల విరాళం సమర్పించినట్టు దేవస్థానం సిబ్బంది వెంకటరమణ, రామకృష్ణ తెలిపారు.



## డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు 2,650, సెంట్రల్ 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

## పతాక నిధికి విరాళం



కాకినాడ సిటీ: సాయుధ దళాల పతాక నిధికి ఎక్స్ సర్వీస్‌మెన్ హెల్ప్‌లైన్ సంస్థ (కాకినాడ) అధ్యక్షుడు అడపా శంకర్, సంస్థ సభ్యులతో కలిసి రూ.1,15,000 చెక్కును కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా మంగళవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖకు అందజేశారు.

## న్యూస్‌రీల్

### రూ.6 లక్షల విలువైన వెండి మకర తోరణాల సమర్పణ



వ్యాఘ్రేశ్వర స్వామికి మకర తోరణం సమర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ట్రస్టు సభ్యులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీవ్యాఘ్రేశ్వర స్వామి, సుబ్రహ్మణేశ్వర స్వామి వార్లకు సింది కుటుంబ సభ్యులు రూ.6 లక్షల విలువైన వెండి మకర తోరణాలను మంగళవారం సమర్పించారు. వీటిని 70 కిలోల వెండితో చేయించారు. సర్వే జనా సుఖినోభవంతు ట్రస్ట్ చైర్మన్ అయ్యగారి సతీష్‌రాజు, కార్యదర్శి, ట్రెజరర్ వక్కలంక రాధాకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నాడ విశ్వనాథరాజు పర్యవేక్షణలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు చేతుల మీదుగా ఈ మకర తోరణాలను స్వామివార్లకు సమర్పించారు. వీటికి అర్చకులు వెలవలపల్లి వ్యాఘ్రి, పుల్లేటికుర్తి లింగయ్యశాస్త్రి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఆలయ ఈఓ సీహెచ్ సత్యనారాయణ, అడ్డగళ్ళ సాయిరాం, బెహరా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### అభయారణ్యంలో పక్షుల గణన ప్రారంభం



అభయారణ్యంలో పక్షుల గణన చేపడుతున్న బృంద సభ్యులు

తాళ్లరేవు: కోరంగి అభయారణ్యంలో నీటి, వలస పక్షుల గణనను అటవీ శాఖ మంగళవారం చేపట్టింది. ఏషియన్ వాటర్ బర్డ్ సెన్సస్‌లో భాగంగా బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం ప్రారంభించారు. శిక్షణ పొందిన సుమారు 60 మంది పర్యావరణ ఔత్సాహికులు, అటవీ సిబ్బంది 12 బృందాలుగా ఏర్పడి గణన చేపట్టారు. వలస పక్షుల సంఖ్య తెలుసుకోవడంతో పాటు, రక్షణ చర్యలు చేపట్టేందుకు ఏటా ఈ గణన చేపడుతున్నట్టు బీఎన్‌హెచ్‌ఎస్ డీడీ సత్యసెల్వం తెలిపారు.

### అంతర్వేది కల్యాణోత్సవాలపై నేడు కలెక్టర్ సమీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం సమీక్ష నిర్వహించనున్నారు. దేవస్థానం ప్రాంగణంలో ఈ సమావేశం జరుగుతుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కాగా ఈ నెల 19న ఆలయంలో ఆర్జిత సేవగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు.

### జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్షకు ఎంపిక



సిరి లలితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్

అమలాపురం టౌన్: జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్షకు అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని దామిశెట్టి సిరి లలిత ఎంపికైంది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ కవల కోటిలింగం మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌సీఈఆర్‌టీ, ప్రసార భారతి, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ద్వారా గత ఏడాది నవంబర్ 8న జాతీయ స్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్ష నిర్వహించింది. అప్పట్లో జిల్లా స్థాయి నుంచి ఆరుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 8న రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రతిభా అన్వేషణ పోటీల సీనియర్స్ విభాగంలో సిరి లలిత జాతీయ స్థాయికి ఎంపికైంది. మే 20, 21 తేదీల్లో కేరళలోని తిరువనంతపురంలో జరిగే జాతీయ స్థాయి శిక్షణలో సిరి లలిత పాల్గొంటుందని కళాశాల కో ఆర్డినేటర్ వై.సుబ్బారావు తెలిపారు. సిరి లలితను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

# చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- 25,407 మంది లబ్ధిదారులకు రూ.61.29 లక్షల మేర లబ్ధి
- నేడు పంపిణీ చేయనున్న సీఎం జగన్



'జగనన్న తోడు'తో సఖినేటిపల్లి మండలంలో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్న మహిళ

**సాక్షి అమలాపురం: చిరు వ్యాపారులకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం కింద లబ్ధిదారులకు బుధవారం వడ్డీ రాయితీ జమ కానుంది. తాడేప**ల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి నగదు జమ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. ఈ పథకం కింద జిల్లాలోని 25,407 మంది లబ్ధిదారులు రూ.61,28,973 మేర లబ్ధి పొందనున్నారు. అత్యధికంగా అమలాపురం నియోజకవర్గంలో 4,483 మందికి వడ్డీ రాయితీగా రూ.11,15,673 అందనుంది.

జగనన్న తోడు పథకం కింద రుణం పొందిన చిరు వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తోపుడు బండ్ల కార్మికులు, ఇళ్ల వద్ద చిన్న చిన్న కిరాణా, పండ్ల దుకాణాలు పెట్టుకున్న వారు, కూరగాయల వ్యాపారులు, సైకిళ్లపై వ్యాపారాలు చేసుకునే వారు, బేకరీలు, జీడిపప్పు, క్వాయర్ తాళ్ల తయారీదారులు, చిన్నగా ఆహార పదార్థాలు తయారు చేసుకునే వారికి జగనన్న తోడు పథకం కింద రూ.10 వేల వరకూ రుణం ఇస్తున్నారు. అలా రుణం పొందిన వారు ప్రతి నెలా అసలు, వడ్డీ కలిపి రూ.900 చొప్పున ఏడాదికి రూ.10,800 చెల్లిస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించిన వారికి వడ్డీ మొత్తాన్ని రాయితీ రూపంలో ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. అసలు రూ.10 వేలు పోను, మిగిలిన రూ.800 వడ్డీని ఏడాదికి రెండు దఫాలుగా రూ.400 చొప్పున వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీని వల్ల చిరు వ్యాపారులు వడ్డీ లేకుండానే రుణం పొందినట్టవుతోంది.

**జిల్లాలో జగనన్న తోడు అమలు కానుందిలా..**

| నియోజకవర్గం | లబ్ధిదారులు | వడ్డీ రాయితీ (రూ.లలో) |
|---|---|---|
| అమలాపురం | 4,483 | 11,15,673 |
| కొత్తపేట | 2,778 | 6,09,452 |
| మండపేట | 3,425 | 8,06,973 |
| ముమ్మిడివరం | 3,813 | 9,47,597 |
| పి.గన్నవరం | 3,746 | 9,18,909 |
| రామచంద్రపురం | 3,698 | 9,62,383 |
| రాజోలు | 3,464 | 7,67,986 |
| మొత్తం | 25,407 | 61,28,973 |

**చిరు వ్యాపారులకు మేలు**



జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు మేలు చేస్తోంది. ఈ పథకం కింద చిన్న వ్యాపారులు రుణం పొంది, క్రమం తప్పకుండా సకాలంలో అసలు, వడ్డీ చెల్లించిన వారికి వడ్డీ రాయితీ తిరిగి చెల్లిస్తున్నాం. దీనివల్ల చిరు వ్యాపారులపై వడ్డీ భారం పడకుండా ఉంటుంది.

– డాక్టర్ శివశంకర్ ప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ

## కరోనా మృతులకు రూ.50 వేల పరిహారం

- రూ.1.60 కోట్లు కేటాయింపు
- జీఓ విడుదల
- జిల్లాలో 280 బాధిత కుటుంబాలకు మేలు

సాక్షి అమలాపురం: కరోనా మహమ్మారి బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి జీఓ నంబర్-1 విడుదల చేసింది. మృతుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున పరిహారం అందజేయనుంది. పరిహారం అందజేయాలంటూ జిల్లా వ్యాప్తంగా 370 బాధిత కుటుంబాల వారు దరఖాస్తు చేసుకోగా, 280 మందికి పరిహారం ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వారి బ్యాంకు అకౌంట్లు, ఇతర వివరాలను పరిశీలించి, తుది జాబితా సిద్ధం చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం సొమ్ము నేరుగా జమ చేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు రూ.1.60 కోట్లు కేటాయించినట్టు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు మంగళవారం తెలిపారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 2 వేల మంది కోవిడ్ మృతుల కుటుంబాల వారికి పరిహారం అందజేశారు. నాడు దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికి సాంకేతిక ఇబ్బందులు, డబుల్ ఎంట్రీలు, బ్యాంకు ఖాతాల్లో తప్పుల వంటి కారణాలతో పరిహారం అందలేదు. కోవిడ్ రెండో దశలో వందలాది మంది మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయి తల్లిదండ్రులు అనాథలుగా మారారు. అటువంటి కుటుంబాలను ఆదుకునే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల చొప్పున పరిహారం అందజేస్తోంది.

## అల్లవరం రోడ్డుకు మోక్షం

- రూ.20 కోట్లు కేటాయించేందుకు ఓఎన్‌జీసీ అంగీకారం
- బెండమూర్లంక – ఓఎన్‌జీసీ ప్లాంట్ రహదారికి రూ.5 కోట్లు
- సంస్థ అధికారులతో మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ చర్చలు



ఓఎన్‌జీసీ కాకినాడ ఈడీ ఆదేష్ కుమార్‌ను సత్కరించిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: అల్లవరం మండలం ప్రధాన రహదారికి మోక్షం కలిగింది. అమలాపురం మండలం పేరూరు వై జంక్షన్ నుంచి గోడిలంక వరకూ ఉన్న ఈ రోడ్డు ఆధునీకరణకు రూ.20 కోట్లు కేటాయించేందుకు ఓఎన్‌జీసీ అంగీకరించింది. ఈ మేరకు ఆ సంస్థ అధికారులతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ మంగళవారం కలెక్టరేట్‌లో చర్చించారు. ఓఎన్‌జీసీ కాకినాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేష్ కుమార్, ఆ సంస్థ ఇతర అధికారులు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ రోడ్డు ప్రాధాన్యాన్ని మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ వివరించారు. ప్రజలకే కాకుండా ఓడలరేవులోని టెర్మినల్‌కు ఓఎన్‌జీసీ వాహనాల రాకపోకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అందువలన ఈ రోడ్డు ఆధునీకరణ ఓఎన్‌జీసీకీ లాభమేనని చెప్పారు. దీంతో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇచ్చేందుకు ఓఎన్‌జీసీ అంగీకరించింది. అలాగే బెండమూర్లంక నుంచి ఓడలరేవులోని టెర్మినల్ వరకూ రోడ్డు నిర్మాణానికి మరో రూ.5 కోట్లు కేటాయించేందుకు సైతం అంగీకరించారు. వారం పది రోజుల్లో టెండర్లు ఖరారై పనులు ప్రారంభం కానున్నాయి. గతంలో గోడిలంక నుంచి బెండమూర్లంక వరకూ రోడ్డును రూ.12 కోట్లతో ఆధునీకరించారు. వై.జంక్షన్ నుంచి గోడిలంక వరకూ రహదారి ఆధునీకరణ పెండింగ్‌లో ఉండగా మంత్రి, ఎంపీల చొరవతో మోక్షం కలగనుంది. ఈ రోడ్డు పూర్తిస్థాయి ఆధునీకరణ వల్ల మండల ప్రజలకే కాకుండా పర్యాటక రంగానికి కూడా ఊతమిచ్చినట్టవుతుంది.

## కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: కొబ్బరి తోటల్లో తెగుళ్లు, పురుగుల నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు సూచించారు. అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకం (ఐసీఏఆర్ – ఏఐసీఆర్‌పీ) ఉప ప్రణాళికలో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన కొబ్బరి రైతులతో మంగళవారం పరిశోధన స్థానంలో ఆయన సమావేశం నిర్వహించారు. కొబ్బరి, కోకో సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. కొబ్బరితో పాటు ఇతర పంటలకు నష్టం కలిగిస్తున్న రూగోస్ తెల్లదోమ నివారణకు సమగ్ర సస్యరక్షణపై చర్చాగోష్ఠి నిర్వహించారు. కొబ్బరిలో జీవ నియంత్రణ పద్ధతిలో కీటక యాజమాన్యంపై శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, డాక్టర్ వి.అనూష అవగాహన కల్పించారు. కొబ్బరిలో వచ్చే గానోడెర్మా, నల్లమచ్చ, మొవ్వకుళ్లు తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ శిలీంధ్ర నాశినులను ఉపయోగించే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 14 మంది ఎస్సీ రైతులకు కొబ్బరి, అంతర పంటలకు ఉపయోగించే ఎలక్ట్రికల్ రీచార్జబుల్ బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరాటంతోనే ఈ విజయం

- యానాం ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్
- ఆద్యంతం ఉత్కంఠ రేపిన ఆయన నిరవధిక దీక్ష
- ఎట్టకేలకు స్పందించిన పుదుచ్చేరి సర్కార్



ఎమ్మెల్యే అశోక్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న మంత్రి నమశ్శివాయం, పుదుచ్చేరి ఎమ్మెల్యేలు

యానాం: ప్రజా పోరాటంతోనే తన నిరవధిక నిరాహార దీక్ష విజయవంతమైందని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. దీక్ష విరమణ అనంతరం ఆయన మంగళవారం స్థానికంగా మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు తాను చేసిన దీక్షకు బాసటగా నిలిచిన ప్రజలకు, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) తమిళిసై సౌందరరాజన్‌కు, హోంమంత్రి నమశ్శివాయానికి, ఎమ్మెల్యేలు కల్యాణ సుందరం, శివశంకర్, రిచర్డ్ జాన్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఆద్యంతం ఉత్కంఠ**

నియోజకవర్గంలో నెలకొన్న 15 ప్రజా సమస్యలపై స్వతంత్ర ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం అర్ధరాత్రి వరకూ నాలుగు రోజుల పాటు స్థానికంగా తీవ్ర ఉత్కంఠ రేపింది. దీక్ష చేపట్టి నాలుగు రోజులైనప్పటికీ పుదుచ్చేరి ప్రభుత్వం స్పందించలేదు. మరోవైపు ఎమ్మెల్యే ఆరోగ్యం క్షీణిస్తూండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. సరిగ్గా ఇదే తరుణంలో యానాం ప్రజా ఉత్సవాల ముగింపు వేడుకల్లో పుదుచ్చేరి సీఎం రంగసామి ఆదివారం పాల్గొన్నారు. దీక్షా శిబిరానికి సీఎం తప్పకుండా వస్తారని, ఎమ్మెల్యేతో దీక్ష విరమింపజేస్తారని అభిమానులు, కార్యకర్తలు ఎదురు చూశారు. అయితే అనూహ్యంగా సీఎం రంగసామి దీక్షాశిబిరం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇక్కడి నుంచి సరాసరి విజయవాడ వెళ్లి, అనంతరం శ్రీశైలం, అక్కడి నుంచి పుదుచ్చేరి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే అశోక్ అనుచరులు ఏంచేయాలో తెలియని గందరగోళ పరిస్థితిని ఎదుర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే అశోక్ బాగా నీరసపడటంతో ఆందోళన వ్యక్తమైంది. ఏ ఒక్క అధికారీ స్పందించకపోవడంతో అందరూ నిరాశ చెందారు.

**కేంద్ర హోం శాఖకు..**

ఇదే సమయంలో ఎమ్మెల్యే అశోక్ నిరవధిక నిరాహార దీక్ష విషయం.. తదనంతర పరిణామాల తీవ్రత కేంద్ర హోం శాఖ దృష్టికి వెళ్లింది. దీంతో అనూహ్యంగా పరిణామాలు వేగంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఎల్‌జీ తమిళిసై సౌందరాజన్ సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడారు. తరువాత కూడా మరో నాలుగుసార్లు ఫోన్‌లో చర్చించారు. దీక్ష విరమించాలని అశోక్‌ను కోరారు. అయితే తన డిమాండ్లపై అధికారికంగా ప్రకటిస్తేనే దీక్ష విరమిస్తానని లేదంటే కొనసాగిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**ప్రత్యేక విమానంలో..**

ఈ పరిస్థితుల్లో అశోక్ ఆరోగ్య పరిస్థితి దిగజారిపోకుండా ఎల్‌జీ తమిళిసై తక్షణమే స్పందించారు. ఈ తరుణంలో పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయం ఆధ్వర్యాన ముగ్గురు ఎమ్మెల్యేల బృందం హుటాహుటిన చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం చేరుకుంది. అక్కడి నుంచి రాత్రి 10.30 గంటలకు వారు యానాం చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేల బృందం అశోక్ వద్దకు వచ్చి సమస్యల పరిష్కారంపై విధి విధానాలను వివరించారు. తరువాత హోంమంత్రి నమశ్శివాయం తుది చర్చలకు వచ్చారు. మొత్తం 15 డిమాండ్లపై సానుకూలత వ్యక్తం చేశారు. సంబంధిత పత్రాలు ఇచ్చి, సంతకాలు చేసిన అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు ఎమ్మెల్యే అశోక్‌కు నమశ్శివాయం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



కుటుంబ సభ్యులతో క్యారమ్స్ ఆడుతున్న కలెక్టరేట్ ఉద్యోగులు



కలెక్టరేట్ ఉద్యోగుల వాలీబాల్



నెట్‌బాల్ ఆడుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు



ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న డీఆర్‌ఓ సత్తిబాబు

## ఒత్తిళ్లకు దూరం.. రోజంతా ఉల్లాసం..

- కలెక్టరేట్‌లో 'ఫ్యామిలీ డే'
- ఉత్సాహంగా గడిపిన ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

సాక్షి అమలాపురం: ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడి అధిగమించడంతో పాటు.. వారి కుటుంబ సభ్యులు పని సంస్కృతిని.. పని చేసే వాతావరణం తెలుసుకునేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం వినూత్నంగా 'ఫ్యామిలీ డే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం కలుసుకుని, రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, మహిళలకు, చిన్నారులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణం, స్థానిక బాలయోగి స్టేడియంలో చదరంగం, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, లెమన్ స్పూన్, వాలీబాల్, క్రికెట్, చిన్నపిల్లల ఆటల పోటీలు నిర్వహించారు. వీటిల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అందరూ కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. పరస్పరం పరిచయాలు చేసుకుని ఆహ్లాదంగా గడిపారు.

**ఇకపై ప్రతి నెలా ఒక రోజు..**

ఈ సందర్భంగా ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులు ఉద్దేశించి కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడారు. ఫ్యామిలీ డే విధానం వల్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగుల పని వాతావరణం తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. ఇకపై ప్రతి నెలా ఒక రోజు కుటుంబ దినోత్సవం జరిపేందుకు నిర్ణయించామని, ఆ రోజు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులను కార్యాలయాలకు తీసుకు రావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల కోసం ఉద్యోగులు పడుతున్న కష్టం.. తపన వారి కుటుంబ సభ్యులకు తెలుస్తుందని అన్నారు. ఫ్యామిలీ డే కార్యక్రమంలో కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ పీవీ రమణకుమారి, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతగా నిలిచిన చిన్నారికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

## క్లుప్తంగా

### భారీగా మద్యం ధ్వంసం



ధ్వంసం చేయడానికి మద్యం బాటిళ్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

రావులపాలెం: వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని స్థానిక గౌతమీ గోదావరి గట్టున పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ, ఎస్ఈబీ రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యాన రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో 2017 నుంచి 2021 వరకూ వివిధ కేసులలో 885 మద్యం సీసాలను, సుమారు రూ.6.50 లక్షల విలువైన 373 లీటర్ల డ్యూటీ పెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని ధ్వంసం చేశారు. ఈ వివరాలను సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సైలు వెంకటరమణ, సుధాకర్ తెలిపారు.

### పందెంకోళ్లు స్వాధీనం

రాజోలు: వ్యాన్‌లో తరలిస్తున్న పందెంకోళ్లను రాజోలు పోలీసులు మంగళవారం తాటిపాకలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కృష్ణమాచారి ఆధ్వర్యాన పోలీసులు తాటిపాక సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మలికిపురం మండలం శంకరగుప్తం నుంచి కాకినాడకు 47 పందెంకోళ్లు తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించారు. అందులోని పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోళ్లు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందాలకు ఎటువంటి అనుమతులూ లేవని, పందాలు, జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై కృష్ణమాచారి హెచ్చరించారు.

### రాష్ట్ర అర్చక ఉద్యోగుల సంక్షేమ నిధి బోర్డు సభ్యుడిగా విత్తనాల



శ్రీనివాస్

రామచంద్రపురం: రాష్ట్ర అర్చక ఉద్యోగుల సంక్షేమ నిధి బోర్డు సభ్యునిగా రామచంద్రపురానికి చెందిన విత్తనాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రెవెన్యూ ఎండోమెంట్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం జీఓ జారీ చేశారు. మండపేట నాళం చినభీమయ్య అన్నసత్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న శ్రీనివాస్ దేవదాయ శాఖ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, అర్చక ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని చెప్పారు.

# సర్కారు వారి పెళ్లికానుక

- పేదల వివాహానికి నగదు సాయం
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అమలుకు చర్యలు
- ఇప్పటికే వచ్చిన అర్జీల పరిశీలన



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మరో హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన యువతుల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం అందజేసేందుకు చర్యలు చేపట్టింది. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన, ఇతర నిర్మాణ రంగాల్లో నమోదైన కార్మికులకు లబ్ధి చేకూరుస్తారు. షాదీతోఫా పథకం ద్వారా ముస్లిం మైనార్టీలకు మేలు కలుగుతుంది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్ 1 తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఇప్పటి వరకూ జిల్లాలో 32 దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వాటిని పరిశీలిస్తున్నారు. అన్ని స్థాయిల్లోనూ సమగ్ర పరిశీలన పూర్తయ్యాక అధికారిక ఆమోదం కోసం కలెక్టర్‌కు ఈ దరఖాస్తులు పంపుతారు.

**దరఖాస్తు చేయడం ఇలా..**

వివాహం జరిగిన 60 రోజుల్లోగా ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి. తొలుత సచివాలయాల ద్వారా వివాహ సర్టిఫికెట్ పొందాలి. అనంతరం నిబంధనల మేరకు వివాహ ధ్రువపత్రాలను దరఖాస్తులో పొందుపర్చాలి. ముఖ్యంగా పెళ్లిపత్రిక, పెళ్లి సమయంలో తీయించిన ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు పెళ్లికుమార్తె బ్యాంకు ఖాతా జిరాక్స్ సమర్పించాలి. వధూవరుల చదువుకు సంబంధించి పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ల జిరాక్సు కూడా దరఖాస్తుకు జత చేయాలి. భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలి. ఈ పథకాలపై వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది తమ పరిధిలోని సంఘాల సభ్యుల ద్వారా ఇప్పటికే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**అర్హతలు ఇవే...**

- వివాహమయ్యేనాటికి వరుడికి 21, వధువుకు 18 సంవత్సరాలు నిండి ఉండాలి.
- భర్త చనిపోయిన స్త్రీ రెండో పెళ్లి చేసుకున్నా అర్హురాలే.
- వధూవరులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- కుటుంబ ఆదాయం నెలకు పల్లెల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలకు మించకూడదు.
- భూమి పల్లం 3 ఎకరాలు, మెట్ట అయితే 10 ఎకరాలు లేదా రెండూ కలిపి 10 ఎకరాలు మించకూడదు.
- కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షన్‌దారు అయ్యి ఉండకూడదు.
- పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు ఉంది.
- కారు ఉండరాదు. ఆటో, ట్రాక్టర్, ట్యాక్సీకి మినహాయింపు ఉంది.
- కుటుంబం నెలవారీ విద్యుత్ వాడకం 300 యూనిట్లు మించరాదు.
- మున్సిపల్ ప్రాంతంలో 1000 ఎస్ఎఫ్‌టీకి మించి నివాస స్థలం ఉండరాదు.

**కల్యాణ కానుక అందిస్తారిలా..**

| కేటగిరీ | ఆర్థిక సాయం (రూ.లలో) |
|---|---|
| ఎస్సీ | 1,00,000 |
| కులాంతర వివాహం | 1,20,000 |
| ఎస్టీ | 1,00,000 |
| బీసీ | 50,000 |
| బీసీ కులాంతర | 75,000 |
| దివ్యాంగ | 1,50,000 |
| భవన నిర్మాణ కార్మికులు | 40,000 |

**సద్వినియోగం చేసుకోవాలి**



పేదల వివాహాలకు ఆర్థిక సాయం అందజేయడానికి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సామాజికవర్గాల వారీగా ఆర్థిక సాయం అందజేస్తుంది. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి కూడా అదనపు ఆర్థిక సాయం అందుతుంది.

– సిరిపురపు సుభాషిణి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం, తూర్పు గోదావరి జిల్లా

## ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న ఎలక్ట్రికల్ స్కూటీ

పి.గన్నవరం: నాగుల్లంక శివారు గుడ్డాయలంకలో ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. గ్రామానికి చెందిన యువకుడు గంటా తరుణ్ 2021లో తన సోదరి పేరిట ఒకినావా కంపెనీకి చెందిన ఎలక్ట్రికల్ స్కూటీ కొనుగోలు చేశాడు. ఆ వాహనంపై మంగళవారం ఉదయం తరుణ్ జగ్గన్నపేట సెంటర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ బయటకు వెళ్లేందుకు స్కూటీ వద్దకు వచ్చి, సెల్ఫ్ బటన్ ఆన్ చేశాడు. వెంటనే డిక్కీలో ఉన్న బ్యాటరీ నుంచి పొగలు వచ్చి క్షణాల్లో స్కూటీ దగ్ధమైందని తరుణ్ విలేకర్లకు చెప్పాడు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో పక్కనే కారు ఉంది. దానిని హుటాహుటిన పక్కకు తరలించారు. స్కూటీ దగ్ధం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

# రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

**19న పాఠశాలలు పునఃప్రారంభం**

రాయవరం: పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులు ప్రకటించారు. తొలుత 11 నుంచి 16వ తేదీ వరకూ సెలవుల ప్రకటించగా.. వివిధ ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకూ సెలవుల షెడ్యూల్‌ను సవరించింది. అయితే 18వ తేదీన ప్రకటించిన అదనపు సెలవుకు బదులు భవిష్యత్తులో ఏదో ఒక సెలవు దినం నాడు పని చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఫిబ్రవరి 12న పని చేయాల్సి ఉంటుందని సంబంధిత డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలలకూ వర్తిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

**ముగిసిన ఎస్ఏ–1 పరీక్షలు**

సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (ఎస్ఏ–1) పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 2 నుంచి ఓరియెంటల్ లాంగ్వేజ్ పేపర్–1తో ఈ పరీక్షలు ప్రారంభించారు. 8వ తరగతికి సైన్స్, గణితం ట్యాబ్ కంటెంట్ విధానంతో నిర్వహించారు. మిగిలిన తరగతులకు డీసీఈబీ విధానానికి అనుగుణంగానే పరీక్షలు నిర్వహించారు. చివరిగా 6, 7, 9, 10 తరగతులకు సోషల్, 8వ తరగతికి గణితం పరీక్షలు జరిగాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 4న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 7వ తేదీతో ముగిశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాల్లో 7,74,752 మంది విద్యార్థులున్నారు. ప్రాథమిక స్థాయిలో 1–5 తరగతి వరకూ 3,79,128 మంది, ఉన్నత పాఠశాలల స్థాయిలో ఆరు నుంచి పదో తరగతి వరకూ 3,68,624 మంది పరీక్షలు రాశారు. వీరందరికీ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారానే పరీక్షలు నిర్వహించారు.

## టెన్త్ పరీక్షలపై నేడు వర్చువల్ సమీక్ష

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ముందస్తు సన్నాహక చర్యలపై ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి బుధవారం వర్చువల్ సమీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకూ ఈ సమీక్ష జరుగుతుంది. సిస్కో వెబెక్స్ సమావేశానికి ప్రధానోపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ఆదేశాలు వచ్చాయి. ప్రతి ఒక్కరూ వెబెక్స్ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబీ) కార్యదర్శి ఎం.వెంకట్రావు తెలిపారు.

**నేటి నుంచి ఎడిట్ ఆప్షన్**

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఆన్‌లైన్ సమాచారంలో బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ ఎడిట్ ఆప్షన్ సదుపాయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం కల్పించింది. తద్వారా ఇప్పటికే ఆన్‌లైన్ నామినల్ రోల్స్ సబ్‌మిట్ చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సమాచారాన్ని పునఃపరిశీలించి, తప్పులు దొర్లితే సరి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇదే చివరి అవకాశంగా భావించి, నామినల్ రోల్స్ సమాచారాన్ని సరిచేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారులు ఎస్‌వీ రవిసాగర్, ఎస్ఏ అబ్రహం తెలిపారు.



# ఖోఖో సందడి

- ఉత్సాహంగా సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్ ప్రారంభం
- 78 వర్సిటీలు.. 1,200 మంది క్రీడాకారులు
- జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో కోలాహలం



ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో క్రీడా సందడి నెలకొంది. అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సహకారంతో నాలుగు రోజుల పాటు నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 78 యూనివర్సిటీల నుంచి 1,200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా మైదానంలో నాలుగుచోట్ల పోటీలు ప్రారంభించారు. తొలి రోజు 30 టీములకు పోటీలు నిర్వహించగా, వీటిలో ప్రతిభ చూపిన వారిని తదుపరి రౌండుకు ఎంపిక చేశారు. రాత్రి 8 గంటల వరకూ పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్లు, సందర్శకులకు ప్రత్యేక గ్యాలరీ, ఫస్ట్ ఎయిడ్ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్రీడాకారులతో పాటు సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు.

**రెండేళ్ల తరువాత..**



కోవిడ్ కారణంగా రెండేళ్లు క్రీడా పోటీలు నిర్వహించలేదు. మళ్లీ ఇప్పుడు యూనివర్సిటీ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించడం, ఇందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. మా యూనివర్సిటీ నుండి 14 మంది ఒక జట్టుగా ఈ క్రీడల్లో పాల్గొంటున్నాం.

– నరేష్, మహాత్మా యూనివర్సిటీ, కొట్టాయం, కేరళ

**సంతోషంగా ఉంది**



వివిధ రాష్ట్రాల విద్యార్థులతో కలిసి పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు సక్రమంగా కల్పించారు. వివిధ యూనివర్సిటీ విద్యార్థుల మధ్య స్నేహ సౌభ్రాతృత్వం పెంపొందింపజేయడానికి ఇటువంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయి.

– ఎం.ప్రశాంత్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

**ఉత్సాహం కలిగించాయి**



ఈ పోటీలు చాలా ఉత్సాహం కలిగించాయి. పోటీలకు వేదికగా నిలిచిన జేఎన్‌టీయూకేకి మా టీమ్ తరఫున కృతజ్ఞతలు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో పోటీల్లో పాల్గొనడం మధురానుభూతిగా నిలుస్తుంది.

– పవన్‌కుమార్ నాయక్, జేఎన్‌టీయూ, అనంతపురం

# పందెం బరి ధ్వంసం

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడిలో ఇళ్ల స్థలాల లే అవుట్‌లో కోడిపందాల కోసం సిద్ధం చేస్తున్న బరిని సీఐ ప్రశాంతకుమార్ మంగళవారం ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేయించారు. పందెం బరి కోసం కోడిపందాల నిర్వాహకులు ఇటీవల లే అవుట్ స్థలాన్ని చదును చేయించారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రశాంతకుమార్ అక్కడికి చేరుకున్నారు. నిర్వాహకులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంక్రాంతి నేపథ్యంలో ఎక్కడైనా కోడిపందాలు, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సరిహద్దు గ్రామాల్లో కోడి పందాలు నిర్వహించినా కేసులు నమోదు చేసి, ఆయా పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్సై పి.గంగాభవాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటా

- నాపై భర్త, అతడి ప్రియురాలి హత్యాయత్నం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- న్యాయం చేయాలి
- వాట్సాప్‌లో మహిళ వీడియో హల్‌చల్
- హడావుడిగా పోలీసుల ఎఫ్ఐఆర్



విలేకర్లతో మాట్లాడుతున్న లోవలక్ష్మి

కాజులూరు: తనపై భర్త, అతడి ప్రియురాలు హత్యాయత్నానికి పాల్పడ్డారని.. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా పోలీసులు నెల రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని.. ఇకనైనా న్యాయం చేయకపోతే పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ మహిళ వీడియో స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడం కలకలం రేపింది. మీడియాకు ఆమె మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు శివారు చాకిరేవు మెరకకు చెందిన అనసూరి లోవలక్ష్మికి పదేళ్ల కిందట కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో వివాహమైంది. అయితే అతడు గ్రామంలోని మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనిపై లోవలక్ష్మి నిలదీసింది. ఈ నేపథ్యంలో ఒక రోజు అర్ధరాత్రి భర్త, అతడి ప్రియురాలు కలిసి లోవలక్ష్మిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న లోవలక్ష్మి కాజులూరులోని పుట్టింటికి వచ్చేసింది. తనపై హత్యాయత్నం జరిగిందని, తనకు న్యాయం చేయాలని గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారు పట్టించుకోకపోవడంతో కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబును కలిసి పరిస్థితి వివరించింది. ఎస్పీ ఆదేశాల మేరకు గొల్లపాలెం పోలీసులు లోవలక్ష్మి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అయితే ఎటువంటి కేసూ నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో తనను నెల రోజులుగా అర్ధరాత్రి వరకూ ముద్దాయి మాదిరిగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని, ఇకనైనా తనకు న్యాయం చేయకపోతే గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకోవటం తప్ప మరో దారి లేదని లోవలక్ష్మి పేర్కొంది. ఆమె ఈవిధంగా మాట్లాడుతున్న వీడియో వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో పోలీసులు మంగళవారం హడావుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**కౌన్సెలింగ్ వల్లనే జాప్యం**

ఇది భార్యాభర్తలకు సంబంధించిన కేసు. ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అందువల్లనే కేసు నమోదు ఆలస్యమైంది. రెండుసార్లు కౌన్సెలింగ్ చేసినా వారు అంగీకరించలేదు. దీంతో మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

## డివైడర్‌ను ఢీకొన్న కారు

**ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులకు గాయాలు**

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు శివారున ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ ఎస్సై ఎ.బాలాజీ కథనం ప్రకారం.. కాకినాడలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు స్నేహితుడి పుట్టిన రోజు వేడుకకు కారులో విశాఖపట్నం వెళుతున్నారు. తుని మండలం చేపూరు దాటిన తర్వాత ముందు వెళుతున్న లారీని తప్పించబోయారు. ఈ క్రమంలో వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన ఎండీ ఆలీషా, మేడిశెట్టి సాయిప్రకాష్, కాయల హరివికాస్, కాయల సాయి ప్రవీణ్, కుందా దిలీప్ (రాజమహేంద్రవరం), గునుపూడి దిలీప్ (తాడేపల్లిగూడెం) గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు వారిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేటి నుంచి ఇంటర్‌కు సంక్రాంతి సెలవులు

రాయవరం: జూనియర్ కళాశాలలకు బుధవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకూ ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తిరిగి ఈ నెల 18న కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. సంక్రాంతి సెలవుల్లో ఎవ్వరూ తరగతులు నిర్వహించరాదని, దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంక్రాంతి సెలవుల ఉత్తర్వుల కాపీని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపించినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.